క్లుప్తంగా

గజమాల యాత్రను విజయవంతం చేయండి

కృత్తివెన్ను: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆలయ నిర్మాత కొప్పనాతి కృష్ణమ్మవర్మ వార సత్వ మహా గజమాల యాత్రను విజయవంతం చేయాలని యాత్ర కమిటీ సభ్యులు విజ్ఞప్తి చేశారు. శనివారం వారు మాట్లాడుతూ ప్రతి ఏడాది ఈ యాత్ర నిర్వహిస్తామని చెప్పారు. ఈ ఏడాది ఈ నెల 31న పల్లెపాలెం కనకపెన్నమ్మ ఆలయం నుంచి బైక్ ర్యాలీగా బయలుదేరి అంతర్వేది చేరుతుందన్నారు. యాత్రలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని అగ్నికుల క్షత్రియ నాయకులు కోరారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

కృత్తివెన్ను: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను శనివారం అందజేశారు. మండల వ్యాప్తంగా 11 ఉన్నత పాఠశాలల్లో 424 మంది విద్యార్థులకు వీటిని అందజేశామని ఎంఈఓ ప్రసాద్ తెలిపారు.విద్యార్థులు వీటిని ఉపయోగించుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. దీనిపై విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అగ్ని బాధితులకు సాయం

వెలువోలు(చల్లపల్లి): వెలువోలు గొడపాలెంలో బొల్లా శ్రీనివాసరావు ఇల్లు పూర్తిగా కాలిపోగా, బాధిత కుటుంబానికి వైఎస్సార్ సీపీ నాయకులు వేములమడ సతీష్ రూ.ఐదు వేలు ఆర్థిక సహాయాన్ని గ్రామ మాజీ సర్పంచ్ వేములమడ నాగేశ్వరరావు, తాతా నాంచారయ్యల చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఎంపీడీఓ ఏఎల్ఆర్‌కే ప్రసాద్, బొల్లా సహదేవుడు పాల్గొన్నారు. అవనిగడ్డకు చెందిన శ్రీరామా వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ తోట శ్యాంకిషోర్ నాయుడు రూ.5వేలు ఆర్థిక సాయం చేశారు.

ధాన్యం బస్తాలు, నగదు అపహరణపై కేసు నమోదు

కోనేరుసెంటర్: సమీప బంధువులు ధాన్యం బస్తాలు, నగదు అపహరించారని బాధితుడు బందరు రూరల్ పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బందరు మండలం తుమ్మలపాలెం గ్రామానికి చెందిన ముక్కొల్లు వెంకటగణేష్ వ్యవసాయం చేస్తుంటాడు. ఈ నెల 20వ తేదీన కుటుంబ సభ్యులంతా కలిసి పొలంలో పనిచేసుకుంటుండగా అతని మేనత్త, భర్త, వారి కుమారుడు, కోడలు వరండాలో ఉన్న 25 ధాన్యం బస్తాలతో పాటు బీరువాలోని రూ. 25వేల నగదును తీసుకువెళ్లారు. దీనిపై గ్రామంలోని వ్యక్తులు సమాచారం ఇవ్వగా ఇంటికి వచ్చిన గణేష్ జరిగింది వాస్తవమని తెలుసుకుని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

వేణుగోపాలుడి హుండీ ఆదాయం రూ.2.57 లక్షలు

కోడూరు: హంసలదీవి రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామివారి ఆలయానికి హుండీ ద్వారా రూ.రూ.2,57,415 ఆదాయం లభించిందని మచిలీపట్నం ఇన్‌స్పెక్టర్ ఎ.శ్రీనివాస్ తెలిపారు. శనివారం ఆలయ ప్రాంగణంలో దేవాదాయ అధికారుల పర్యవేక్షణలో హుండీ లెక్కింపు నిర్వహించారన్నారు. కార్యక్రమంలో ఈఓ సుధాకర్, సర్పంచి కొక్కిలిగడ్డ భిక్షాలు, ఎస్‌కేఆర్ విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

రహదారి అభివృద్ధికి రూ. లక్ష సాయం

అశ్వరావుపాలెం(అవనిగడ్డ): అశ్వరావుపాలెం రహదారికి దేవనబోయిన రేణుకయ్య కుటుంబ సభ్యులు రూ. ఒక లక్ష సహాయం అందించారు. గ్రామం ప్రారంభం నుంచి 150 మీటర్ల మేర రహదారికి ఇరువైపులా రబ్బీస్, బుసక తోలించి విస్తరించారు. రహదారికి ఇరు వైపులా సిమెంట్ పోల్స్ వేసి మొక్కలు నాటారు. ఈ పనులకు అయిన ఒక లక్ష రూపాయలను కొత్తపేటకు చెందిన దేవనబోయిన రేణుకయ్య జ్ఞాపకార్థం వారి కుమారులు దేవనబోయిన వెంకటకుమార్, నిశాంత్ కుమార్‌లు పంద్రాజు నాగ సాంబ శివరావు ద్వారా సహాయం అందించారు. రహదారి విస్తరణకు సహకరించిన దాతలకు సర్పంచ్ పి. లంకమ్మ ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు.

భారీ వాహన డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం ఆర్టీసీ డిపోలోని భారీ వాహన డ్రైవింగ్ శిక్షణ పొందగోరు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నామని డీఎం పెద్దిరాజు తెలిపారు. 16వ బ్యాచ్ డ్రైవర్ శిక్షణ కోసం అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నామన్నారు. శిక్షణ పొందగోరు అభ్యర్థులు పనిదినాల్లో డిపో మేనేజర్ కార్యాలయంలో సంప్రదించాలని చెప్పారు. మరిన్ని వివరాలకు సెల్: 99592 25462, 73829 03240 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

ముగిసిన ధ్యాన మహాయజ్ఞం

బంటుమిల్లి: స్థానిక కనకదుర్గ పిరమిడ్ శక్తి క్షేత్రంలో 11 రోజులుగా జరుగుతున్న మౌన, ధ్యాన మహా యజ్ఞం శనివారంతో ముగిసింది. ఉదయం నుంచి పలు విషయాలపై మాస్టర్ ట్రైనర్లు ఔత్సాహికులకు శిక్షణ ఇచ్చారు. అనంతరం బంటుమిల్లి వీధుల్లో ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ సెంటర్లో మానవహారం నిర్మించారు. కనకదుర్గ పిరమిడ్ కేంద్రం నిర్వాహకులు ఎస్. రేవతి, పి. వెంకటస్వామి, పలు జిల్లాలకు చెందిన ఔత్సాహికులు పాల్గొన్నారు.

నవరత్నాలతో పేదలకు అండ



బ్రోచర్ అందజేసి ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న మంత్రి జోగి రమేష్



వేకనూరులో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సింహాద్రి

మంత్రి జోగి రమేష్

బంటుమిల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్న పథకాలు అమలు చేసి పేదలకు అండగా నిలుస్తున్నారని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ అన్నారు. రామవరపుమోడి, ఆముదాలపల్లి గ్రామాల్లో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మంత్రి మాట్లాడుతూ పేద కుటుంబాలను ఆర్థికంగా ఆదుకుని ప్రతి కుటుంబంలోను పిల్లలను విద్యావంతులను చేసేందుకు చేపట్టిన పథకాలు మంచి ఫలితాలు ఇస్తున్నాయన్నారు. గత టీడీపీ ప్రభుత్వం చేసిన అవకతవకల కారణంగా ప్రభుత్వ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు అందలేదని మంత్రి విమర్శించారు. ఈ విషయాలను గమనించే జగనన్న పేదల కోసం సంక్షేమ పథకాలు రూపొందించి కుల, మత, పార్టీలకు అతీతంగా అందరికీ అందజేస్తున్నారని చెప్పారు. జగనన్నకు అండగా పేదలు నిలవాలని కోరారు. వ్యవసాయ కూలీలైన రామవరపుమోడి గ్రామానికి చెందిన కాగిత అయ్యప్ప, కల్యాణిలు మంత్రిని కలిసి తమ బాధలు చెప్పుకున్నారు. పసిబాలుడైన తమ కుమారుడికి లక్షలాది రూపాయలు అప్పులు చేసి సుమారు 10 నెలల కిందట విజయవాడలోని ప్రైవేట్ ఆస్పత్రిలో ఆపరేషన్ చేయించామని చెప్పారు. ప్రభుత్వ సాయం అందించాలని విన్నవించారు. స్పందించిన మంత్రి పెదతుమ్మిడి పీహెచ్‌సీ వైద్యులు జయశ్రీని పిలిచి కేసు వివరాలు సేకరించాలని ఆదేశించారు. ఆస్పత్రి వైద్యులతో మాట్లాడి సాయం అందించేందుకు కృషి చేస్తానని, ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు. జెడ్పీటీసీ ఎం. వెంకటరమణ, ఏఎంసీ చైర్మన్ కె. గంగాధర్, వైస్ చైర్మన్ పి. బాబూరావు, వైస్ ఎంపీపీ ఓ. చిన్నారిబాబు, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ టి. శ్రీనివాసరావు, తహసీల్దార్ సత్యనారాయణమూర్తి, ఎంపీడీఓ జె. స్వర్ణభారతి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఎం. రాజబాబు, సర్పంచ్‌లు కనకదుర్గ, రమేష్, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

ప్రజల ముంగిటకే సేవలు: ఎమ్మెల్యే సింహాద్రి

వేకనూరు(అవనిగడ్డ): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని రంగాలు అభివృద్ధి సాధిస్తున్నాయని, ప్రజల ముంగిటకే అన్ని సేవలు అందుతున్నాయని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. మండల పరిధిలోని వేకనూరులో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే సింహాద్రి, వైఎస్సార్ సీపీ నాయకుడు సింహాద్రి వికాస్ ఇంటింటికీ తిరిగి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే సింహాద్రి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గతంలో ఎన్నడూ లేనివిధంగా విద్యా రంగంలో పెనుమార్పులు తీసుకొచ్చారని చెప్పారు. నాడు–నేడు ద్వారా పాఠశాలల అభివృద్ధి, పౌష్టికాహారం అందించే మెనూ, విద్యా, వసతి దీవెన వంటి కార్యక్రమాలు మిగిలిన రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయన్నారు. పేద, మధ్య తరగతి ప్రజలకు మేలు చేకూరే పనులు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిపై పనిగట్టుకుని విమర్శలు చేయడం తగదన్నారు. మేలు జరిగితేనే ఆదరించమంటున్నారని, గతంలో ఇంత దమ్ముగా చెప్పిన ముఖ్యమంత్రి ఎవరూ లేరన్నారు. ప్రజలు మరోసారి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని సీఎం చేసేందుకు ఎదురు చూస్తున్నారని చెప్పారు. ఎంపీపీ తుంగల సుమతీదేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, ఎంపీటీసీ వర్రే నరేష్, గ్రామ కన్వీనర్ తుంగల వేణుగోపాలస్వామి, నాయకులు పాల్గొన్నారు.

గడప గడపలో సంతోషం..



బందరులో వృద్ధురాలి సమస్యలు అడిగి తెలుసుకుంటున్న పేర్ని కిట్టు

మచిలీపట్నంటౌన్: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి గడపలోనూ సంతోషం వెల్లివిరుస్తోందని వైఎస్సార్ సీపీ నాయకుడు పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. బందరు పదో డివిజన్‌లో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్పొరేటర్ షేక్ ముంతాజ్‌బేగం, డివిజన్ ఇన్‌చార్జ్ షేక్ బాషాలతో కలిసి సుకర్లాబాద్ ప్రాంతంలో గడప గడపకు వెళ్లి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తనకు వివిధ పథకాల ద్వారా మొత్తం రూ. 50,003 లబ్ధి చేకూరిందని స్థానికురాలు మొహమ్మద్ సురాజున్నీసా తెలిపింది. అలాగే తనకు ప్రభుత్వ పథకాల ద్వారా మొత్తం రూ. 2,26,309, ఇంటిస్థలం, పక్కాగృహం మంజూరయ్యాయని దాసరి రత్నకుమారి పేర్ని కిట్టుకు వివరించింది. కార్యక్రమంలో కార్పొరేటర్లు కాగిత జవహర్‌లాల్, గోపిశెట్టి సతీష్, ఐనం తాతారావు, కో–ఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ చీలి రవీంద్ర, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

గూడూరు: గూడూరు మండలం ఐదుగుళ్లపల్లి సచివాలయం పరిధిలోని రామన్నపేట, ఐదుగుళ్లపల్లి గ్రామాల్లో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీఓ డి.సుబ్బారావు తెలిపారు. ఉదయం 10 గంటలకు రామన్నపేట, మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఐదుగుళ్లపల్లి గ్రామాల్లో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ ప్రతి గడపను సందర్శిస్తారన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ధికి సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేస్తారని చెప్పారు. ఆయా గ్రామాల్లోని ప్రజాప్రతినిధులు, అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొనాలని కోరారు.

24న ఉపాధి పనులపై ప్రజా వేదిక

నాగాయలంక: మండలంలో ఉపాధి హామీ పనులపై ఈనెల 24వ తేదీన ఉదయం 10 గంటలకు నాగాయలంకలోని ఉపాధి హామీ కార్యాలయం వద్ద ప్రజా వేదిక కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీఓ వేమూరి శ్రీనివాసరావు శనివారం తెలిపారు. 2020–21, 2021–22 మార్చి కాలంలో రూ.16.47 కోట్లతో జరిగిన 2,487 పనులు, రూ.3.95 కోట్లతో జరిగిన పంచాయతీరాజ్ శాఖ పనులకు సామాజిక తనిఖీ సభ్యులు నిర్దేశించిన షెడ్యూల్ మేరకు గ్రామ సభల ద్వారా తనిఖీలు పూర్తి చేశారు. ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, ఉద్యోగులు ప్రజావేదికకు హాజరు కావాలని కోరారు.

28న నేత్ర వైద్య శిబిరం

నాగాయలంక: జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర కంటి ఆస్పత్రి (పెదకాకాని) సహకారంతో స్థానిక సుదర్శి మానవతా సేవాసంస్థ ఆధ్వర్యంలో ఈనెల 28వ తేదీన ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తామని సంస్థ అధ్యక్షుడు తలశిల రఘుశేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నాగాయలంక కృష్ణానది తీరంలోని ఫుడ్ కోర్టు ఆవరణలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శిబిరం జరుగుతుందన్నారు. సంబంధిత వైద్య పరీక్షల వివరాల కోసం సెల్: 94906 36466, 70936 17778 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు. కంటిలో శుక్లాలు ఉన్నవారికి శంకర కంటి ఆస్పత్రిలో ఆపరేషన్లు ఉచితంగా చేయిస్తామని శేఖర్ తెలిపారు.

24న ఈఈ మెరిట్ ప్రిలిమినరీ పరీక్ష

పెడన: ఎడ్యుకేషనల్ ఎఫీషనీ సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఆన్‌లైన్ ఈఈ మెరిట్ టెస్ట్ 2023 ప్రిలిమినరీ పరీక్ష ఈ నెల 24వ తేదీన నిర్వహిస్తామని డీఈఓ తాహెరా సుల్తానా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రిజిస్టర్ చేసుకున్న ఏడో తరగతి విద్యార్థులకు ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు, పదో తరగతి వారికి ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరుగుతుందని తెలిపారు. మరింత సమాచారం కోసం సెల్: 95731 39996, 96667 47996 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

రంగుమారిన ధాన్యాన్ని కొనుగోలు చేయాల్సిందే

ఆర్డీఓ కిషోర్

పెడన: రైతుల నుంచి రంగుమారిన ధాన్యాన్ని ప్రభుత్వం నిర్దేశించిన ధరల ప్రకారం కొనుగోలు చేయాల్సిందేనని మచిలీపట్నం ఆర్డీఓ ఐ. కిషోర్ మిల్లర్లకు స్పష్టం చేశారు. శనివారం ఆయన పట్టణంలోని రామాంజనేయ రైస్ మిల్లును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ధాన్యం సేకరణ విషయంలో ధాన్యం లోడు రాగానే వెంటనే దించి అన్‌లోడు చేయిస్తున్నదీ లేనిదీ కస్టోడియన్ల నుంచి సమాచారం తీసుకున్నారు. ఆయన మాట్లాడుతూ రంగుమారిన ధాన్యం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా మార్గదర్శకాలను విడుదల చేసిందన్నారు. పది శాతం వరకు ఐదు శాతం కటింగ్, 10 నుంచి 20 శాతం వరకు ఉంటే 14 శాతం కటింగ్ చేసి రైతుకు ధర చెల్లించాలని స్పష్టం చేశారు. అదే విధంగా 20 నుంచి 30 శాతం ఉంటే 25 శాతం కటింగ్, 30 నుంచి 40 శాతం ఉంటే 31 శాతం కటింగ్, 40 శాతానికి పైగా రంగుమారితే 36 శాతం కటింగ్ పోను మిగిలిన ధరను రైతుకు ఇవ్వాల్సిందేనని తెలిపారు. మిల్లర్లు తేమ శాతం లెక్కింపు విషయంలో సందేహాలు వ్యక్తం చేస్తున్నారని, ఈ సందేహాలను నివృత్తి చేయడానికి, రైతులకు నష్టం కలుగకుండా ఉండటానికి పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి జిల్లాల మిల్లర్ల టెక్నికల్ అసిస్టెంటెంట్లు తహసీల్దారు కార్యాలయాలకు వస్తున్నారని చెప్పారు. ఈ నెల 23న మండల కేంద్రాల్లోని తహసీల్దార్ల కార్యాలయంలో మన టెక్నికల్ అసిస్టెంటెంట్లు సమక్షంలో రైతుల ధాన్యం తేమ శాతాన్ని లెక్కిస్తారని వివరించారు. తహసీల్దారు మధుసూధనరావు, ఆర్ఐ ఎం మణికుమార్, వీఆర్వోలు ఉన్నారు.

● గూడూరు: మాండూస్ తుపాను ప్రభావంతో వర్షాలకు తడిచి రంగు మారిన ధాన్యం సేకరణలో రైతులను ఇబ్బంది పెట్టవద్దని గూడూరు తహసీల్దార్ బీవీ ప్రసాద్ మిల్లర్లను కోరారు. శనివారం మండలంలోని పలు గ్రామాల్లో రైతులతో మాట్లాడిన తహసీల్దారు రంగు మారిన ధాన్యం కొనుగోళ్లలో ఎదురవుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. రైతులు ఏమైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం రైసు మిల్లర్లతో మాట్లాడిన తహసీల్దార్ ధాన్యం కొనుగోళ్ల విషయంలో ప్రభుత్వ మార్గదర్శకాలు పాటించాలని కోరారు.

● నాగాయలంక: రేమాలవారిపాలెం, భావదేవరపల్లి గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలను నాగాయలంక తహసీల్దార్ జె.విమలకుమారి శనివారం పరిశీలించారు. ధాన్యం కొనుగోళ్లను పరిశీలించి రైతులతో మాట్లాడారు. మాండూస్ తుపాను కారణంగా తడిసి రంగుమారిన ధాన్యా న్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తోందన్నారు. రేమాలవారిపాలెంలోని శ్రీ రామకృష్ణా రైస్ మిల్లును సందర్శించిన ఆమె మాట్లాడుతూ మిల్లర్లు లేదా టెక్నికల్ అసిస్టెంట్లు ఎవరైనా రైతులను ఇబ్బందులకు గురిచేసినట్లు ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమస్యలు ఉంటే రైతులు తక్షణమే తహసీల్దార్ కార్యాలయం దృష్టికి తీసుకురావాలన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి

గూడూరు: వైఎస్సార్ జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలాలు పొందిన లబ్ధిదారులు గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని జిల్లా గృహ నిర్మాణ సంస్థ పీడీ జీవీ సూర్యనారాయణ అన్నారు. గూడూరు మండలం తరకటూరులోని వైఎస్సార్ జగనన్న కాలనీ లే అవుట్‌ను పీడీ శనివారం పరిశీలించి మాట్లాడారు. లే అవుట్లలో అంతర్గత రహదారులు, విద్యుత్ లైన్లు, డ్రెయినేజీ, తాగునీటి వసతులు కల్పించేందుకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకునేందుకు అవసరమైన సహకారం శాఖా పరంగా అందిస్తున్నామని తెలిపారు. ఎంపీటీసీ సభ్యుడు జక్కా ధర్మారాయుడు, సర్పంచి చిన్నం వెంకట రమణమ్మ, గృహ నిర్మాణ, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కల పంపిణీ

గూడూరు: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా కలపటం గ్రామంలో మొక్కలు పంపిణీ కార్యక్రమాన్ని గూడూరు ఎంపీపీ సంగా మధుసూదనరావు శనివారం ప్రారంభించారు. సర్పంచి ఐనాల దేవనాగ శ్రీనివాస్, ఎంపీటీసీ వై.శ్రీనివాసరావు, కో–ఆప్షన్ సభ్యుడు కరీముల్లా, నాయకులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా చూడండి



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ అపరాజితసింగ్

చిలకలపూడి(మచిలీపట్నం): ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్ అన్నారు. జిల్లా పరిషత్ సమావేశపుహాల్‌లో ధాన్యం కొనుగోలు ప్రక్రియపై నియమించిన కస్టోడియన్ అధికారులతో శనివారం సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ ఆర్బీకేల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు లారీల్లో తరలించినప్పుడు వెంటనే దిగుమతి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు మిల్లర్లతో సంప్రదించకుండా కస్టోడియన్ అధికారులు చూడాలని చెప్పారు. ఆర్బీకేల్లో పరిశీలించిన నాణ్యత, ప్రమాణాలే ఫైనల్‌గా ఉంటాయన్నారు. రైస్‌మిల్లుల్లో నాణ్యత, ప్రమాణాలు వ్యత్యాసం వస్తే కస్టోడియన్ అధికారి సమక్షంలో మరలా పరిశీలించి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ధాన్యం మిల్లులకు చేరిన వెంటనే గోనెసంచులను సేకరించి తిరిగి వాటిని ఆర్బీకేలకు తరలించేలా చూడాలని చెప్పారు. గోనెసంచులు లేవనే మాట రాకుండా రైతులకు ఎప్పటికప్పుడు సరఫరా చేసేలా చూడాలన్నారు. ట్రక్ షీట్ జనరేట్ చేయించటం తదితర అంశాలను నిత్యం పర్యవేక్షించాలని చెప్పారు. ఈ ప్రక్రియలో ఎటువంటి నిర్లక్ష్యం వహించినా చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. సమావేశంలో సివిల్ సప్లయీస్ డీఎం శ్రీధర్, డీఎస్ఓ వి. పార్వతి తదితరులు పాల్గొన్నారు.

ఆదివనవలమ్మ దేవి జాతర ప్రారంభం

కనుల పండువగా అమ్మవారి ఊరేగింపు



మచిలీపట్నంటౌన్: భక్తుల కొంగుబంగారంగా కొలవబడే ఆదివనవలమ్మ దేవి జాతర మహోత్సవం శనివారం వైభవంగా ప్రారంభమైంది. స్థానిక నిజాంపేటలోని నూతివీరయ్య గారి ఆదివనవలమ్మదేవి అమ్మవారి ఆలయం వద్ద ఉదయం నుంచి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. 1918 నుంచి గ్రామ దేవత వనవలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. బందరు నగరంతో పాటు ఇతర ప్రాంతాల్లో ఉండే ఆడపడుచులు అమ్మవారి జాతరలో పెద్ద ఎత్తున పాల్గొననున్నారు. శనివారం రాత్రి అమ్మవారి ఊరేగింపు గుడి వద్ద మూడు ప్రదర్శనలతో కనుల పండువగా నిర్వహించారు. ఊరేగింపు ముందుభాగాన విచిత్ర వేషధారుల ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. సాయంత్రం ఆరు నుంచి ఆదివారం ఉదయం 8.30 గంటల వరకు భక్తులు మొక్కులు చెల్లించుకుంటారు. ఆదివారం అమ్మవారి జాతర మహోత్సవాన్ని పెద్ద ఎత్తున నిర్వహించనున్నారు. సోమవారం ఆలయం వద్ద భక్తులకు అన్నసమారాధన నిర్వహిస్తారు. ఫిబ్రవరి 19వ తేదీ ఆదివారం నెల సంబరాన్ని నిర్వహించనున్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిగ దిగుబడులు

కోనేరుసెంటర్: రైతులు సాగులో యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని జిల్లా వ్యవసాయ అధికారి వైవీఎస్ మనోహర్‌రావు అన్నారు. అరిశేపల్లి గ్రామంలో రైతులకు పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులకు పలు సూచనలు చేశారు. జిల్లా వనరుల కేంద్రం డెప్యూటీ డైరెక్టర్ జ్యోతిరమణి, ఏఓ జీవీ శివప్రసాద్, పీఏసీఎస్ అధ్యక్షుడు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అరుణాచల యాత్రకు బస్సు సర్వీస్

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం ఆర్టీసీ డిపో నుంచి ఫిబ్రవరి 3వ తేదీ రాత్రి ఏడు గంటలకు అరుణాచల యాత్రకు బస్సు సర్వీసును ఏర్పాటు చేశామని డీఎం టి. పెద్దిరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 4వ తేదీ శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం దర్శించుకుని ఆ రోజు రాత్రి 10 గంటలకు అరుణాచలం చేరుకుంటుందన్నారు. అనంతరం గిరి ప్రదక్షిణలు, అరుణాచలేశ్వరుని దర్శనం అనంతరం 5వ తేదీన బయలుదేరి 6వ తేదీ ఉదయం మచిలీపట్నం చేరుతుందని చెప్పారు.

నేటి నుంచి లక్ష్మీనరసింహ స్వామి ఆలయ వార్షికోత్సవం

కోనేరుసెంటర్: బందరు మండలం పెదకరగ్రహారం గ్రామంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయ వార్షిక మహోత్సవాలు ఆదివారం నుంచి ఫిబ్రవరి 5వ తేదీ వరకు జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటలకు విఘ్నేశ్వరపూజతో మహోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. అనంతరం ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరుగుతాయని చెప్పారు. మధ్యాహ్నం 12 గంటలకు స్వామివారికి హారతి, మంత్రపుష్పంతో పాటు ప్రసాద వినియోగం జరుగుతుందన్నారు. అనంతరం వేదపండితులు, పెద్దలను సన్మానిస్తారని చెప్పారు.

రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు గూడూరు విద్యార్థులు

గూడూరు: కర్నూలులో ఈనెల 27 నుంచి జరుగనున్న రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు గూడూరు జెడ్పీ హైస్కూల్ టెన్త్ విద్యార్థులు జోగి విజయమాధవి, నిమ్మగడ్డ హర్షిత్ కుమార్ ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయిని డి.పుష్పలత తెలిపారు. విద్యార్థులను, వారికి శిక్షణ ఇచ్చిన పీడీ అరుణను ఆమె అభినందించారు.

కార్మిక చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న న్యాయమూర్తి కేవీ రామకృష్ణయ్య

చిలకలపూడి(మచిలీపట్నం): కార్మిక చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కేవీ రామకృష్ణయ్య అన్నారు. జ్యోతిరావుపూలే విజ్ఞాన కేంద్రంలో భవన నిర్మాణ కార్మికులకు న్యాయ విజ్ఞాన సదస్సు శనివారం నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ కార్మికులందరూ సంఘాలుగా ఏర్పడితే ప్రభుత్వాల నుంచి రావాల్సిన పరిహారం అందే అవకాశం ఉంటుందన్నారు. కార్మికులకు ఇబ్బందులు ఎదురైనప్పుడు రావాల్సిన పరిహారం అందకపోతే తమ సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయాన్ని పొందవచ్చని చెప్పారు. గతంలో స్త్రీలు, పురుషులకు వేర్వేరుగా వేతనాలు ఇచ్చే వారని, తరువాత సమాన పనికి సమాన వేతనం ఇచ్చేలా కనీస వేతన చట్టం తీసుకువచ్చారని వివరించారు. పని చేసే ప్రదేశంలో మహిళా కార్మికులకు మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. న్యాయవాది చీలి మునలయ్య, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఎస్. గోవిందు, ఏఎస్ఐ సాంబశివరావు, జయరావు పాల్గొన్నారు.

డ్రోన్ల వినియోగం లాభదాయకం

ఘంటసాల(అవనిగడ్డ): వ్యవసాయ రంగంలో డ్రోన్ల వినియోగం వల్ల కూలీల ఖర్చులు తగ్గుతాయని, సమయం ఆదా అవుతుందని ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ పి. శ్రీలత అన్నారు. స్థానిక కేవీకేలో శనివారం డ్రోన్ల వినియోగంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శ్రీలత మాట్లాడుతూ 15 లీటర్ల నీటితో పది నిముషాల్లోనే ఎకరం పొలంలో పురుగు మందును పిచికారీ చేయవచ్చని చెప్పారు. దీనివల్ల కూలీల ఖర్చులు తగ్గడంతో పాటు సమయం ఆదా అవుతోందన్నారు. అనంతరం కేవీకే ప్రాంగణంలో సాగుచేస్తున్న మినుము పంటలో డ్రోన్ల ద్వారా పురుగు మందు పిచికారీని రైతులకు చూపించారు.

గృహ నిర్మాణాలకు ముందుకు వచ్చిన లబ్ధిదారులు

అన్నవరం(మోపిదేవి): వెంకటాపురం శివారు అన్నవరం గ్రామంలో జగనన్న లే అవుట్స్‌లో గృహ నిర్మాణాలకు లబ్ధిదారులు ముందుకు వచ్చారు. లే అవుట్స్‌లో మంజూరైన 26 మంది లబ్ధిదారులతో గృహ నిర్మాణ శాఖ ఏఈ రాజులపాటి తాండవకృష్ణ శనివారం సాయంత్రం అవగాహన సదస్సు నిర్వహించి పలు సూచనలు చేశారు.